సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



వంగ సాగు.. బెంగ తీరగ

వంకాయ సాగులో అనేక ఇబ్బందులు ఉన్నా పండించే రైతు కష్టాలను తీరుస్తుంది.

వివరాలు 8లో ▸



ఏడుపాయల జాతర

జాన పదుల వేడుకగా వినుతికెక్కిన ఏడుపాయల జాతర రేపటి నుంచి ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



రేపే పెద్ద పట్నం

కొమురవెల్లి తోటబావి ప్రాంగణంలో పెద్ద పట్నం వేసి స్వామి వారికి కల్యాణం నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

దళితబంధు నిధులు విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్ ఖాతాలతో జమ చేసిన దళితబంధు డబ్బులు లబ్ధిదారులకు గ్రౌండింగ్ చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కంగ్టి మండల కేంద్రంలో దళితబంధు లబ్ధిదారులు నిర్వహించిన ధర్నా, ర్యాలీకి ఆయన సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తాను నియోజకవర్గంలోని 739 దళిత కుటుంబాల లబ్ధిదారులకు దళితబంధు మంజూరు చేయించానని, కలెక్టర్ ఖాతాలో యూనిట్‌కు రూ.3 లక్షల చొప్పున జమ చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం అధికార పార్టీ నేతలు దళితుల పట్ల మొసలి కన్నీరు కార్చడమే కాని మంజూరైన నిధులు విడుదల చేయించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు విశ్వనాథ్, నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణా ముదిరాజ్, పవన్‌పాటిల్, బీఆర్ఎస్ నాయకులు, దళితబంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న మేనేజర్, హెచ్‌ఎం

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అప్పరంజని తెలిపారు. పాఠశాలకు సమీపంలోని వివిధ గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థినులకు సౌకర్యం కల్పించాలని ఉద్దేశంతో ఎస్‌బీఐ మేనేజర్ సూర్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



ప్రశంసా పత్రం అందుకుంటున్న రాములు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానా పూర్(కె)కు చెందిన రాములు యాదవ్ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్ జింఖాన గ్రౌండ్‌లో ఆదివారం తెలంగాణ మాస్టర్ అథ్లెటిక్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. 200 మీటర్ల లాంగ్ జంప్ పోటీల్లో బంగారు పతకం, 400 మీటర్ల లాంగ్ జంప్ పోటీలో రజతం సాధించారు. మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఏప్రిల్ 20 నుంచి 24 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాములు యాదవ్ కృష్ణాపూర్ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పీఈటీగా పనిచేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

ట్రెయినీ కలెక్టర్ మనోజ్

ఝరాసంగం(జహీరాబాద్): మహాశివరాత్రిని పురస్కరించుకొని కేతకీ సంగమేశ్వర ఆలయంలో నిర్వహించే ఉత్సవాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ట్రైనీ కలెక్టర్ మనోజ్ ఆదేశించారు. సోమవారం ఝరాసంగంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ.. వివిధ మండలాల నుంచి 40 మంది పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడబ్ల్యూ వర్కర్లు 100 మంది, జహీరాబాద్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు 30మందిని డిప్యుటేషన్‌పై జాతరలో విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధంగా మూడు షిఫ్టులు, 11 ప్రదేశాలను గుర్తించినట్లు వెల్లడించారు. జాతరలో ఎప్పటికప్పుడు చెత్త సేకరణ జరగాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.


నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం మ. 2 గంటల నుంచి సా. 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపేస్తున్నట్లు ఏడీఈ మాధవరావు తెలిపారు. సబ్ స్టేషన్ 3 లోని గాంధీనగర్, జ్యోతినగర్, అలాగే, సబ్‌స్టేషన్ 4లో కొత్తగా సబ్ స్టేషన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఓల్డ్ విలేజ్ జ్యోతినగర్, ట్యాంక్ ఏరియా, అదానద్ బీసీ కాలనీ ఓల్డ్ విలేజ్ , ఎస్సీ కాలనీ, గోప్ ఏరియా, జ్యోతి ఏరియా బస్టాండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

ఇప్పుడే ఇలా.. మేలో ఎలా?

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు షురూ

- ముందస్తు పనులు పూర్తి చేయడంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం
- ఏప్రిల్, మే నెలల్లో భారీగా పెరగనున్న లోడ్
- వినియోగదారుల్లో ఆందోళన



సంగారెడ్డిలోని చాణక్యపురి కాలనీలో ఆదివారం ఓ నివాస గృహానికి సంబంధించిన లోడ్ పెరిగి సర్వీసు వైరు కాలిపోయింది. ఒక్క ఇంటి సర్వీసు వైరు కాలిపోతే ఏకంగా ఆ కాలనీ మొత్తానికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సరఫరాను వెంటనే పునరుద్ధరించాల్సిన ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వేసవి ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఎండలు ముదిరే ఏప్రిల్, మే మాసాల్లో భారీగా పెరిగే విద్యుత్‌లోడ్ ఏ మేరకు సరఫరాల్లో అంతరాయం కలుగుతుందోనని వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: వేసవిలో పెరగనున్న విద్యుత్ లోడ్‌తో సరఫరాలో అంతరాయం రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ఆశాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన ముందస్తు ఏర్పాట్ల పనులు పూర్తి చేయడంలో అలసత్వం వీడటం లేదు. ఈ వేసవిలో పెరగనున్న విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా 350 వరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు (డిస్ట్రిబ్యూటరీ) బిగించాలని నిర్ణయించారు. ఫిబ్రవరి చివరి వారం వచ్చినప్పటికీ ఇప్పటి వరకు కనీసం 150 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించలేదు. అలాగే ఎండా కాలంలో అకాల వర్షాలు, ఈదురు గాలులు వీస్తే విద్యుత్ లైన్లు తెగిపడితే సరఫరాలో అంతరాయం కలుగుతుంది. అలాగే, విద్యుత్ లైన్లపై లోడ్ పెరిగితే కూడా అవి కాలిపోతుంటాయి. ఇలా ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా 11 కేవీ సామర్థ్యం కలిగిన 47 కొత్త లైన్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. కొత్తగా 10 సబ్‌స్టేషన్లను నిర్మించాలని అనుకున్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం ఒక్క సబ్ స్టేషన్ నిర్మాణ పనులు మాత్రమే జరిగాయి. మిగిలిన సబ్‌స్టేషన్ల పనులు కొనసాగుతున్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

11 శాతం పెరిగిన విద్యుత్ లోడ్

జిల్లాలో మొత్తం 8.20 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో 6.14 లక్షల కనెక్షన్లు గృహ విద్యుత్‌కు సంబంధించినవి ఉన్నాయి. ఎండా కాలం వచ్చిందంటే చాలు ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌ల వాడకం ఎక్కువ ఉంటుంది. రెండు, మూడు రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో వీటి వాడకం పెరిగింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ లోడ్ పెరుగుతోంది. గత ఏడాది ఇదే ఫిబ్రవరి చివరి వారంలో రోజుకు 658 మెగావాట్ల విద్యుత్ లోడ్ రికార్డు అయితే.. ప్రస్తుతం శనివారం ఒక్క రోజే ఈ విద్యుత్ లోడ్ ఏకంగా 734 మెగావాట్లకు పెరిగింది. అంటే సుమారు 11 శాతం లోడ్ పెరిగినట్లు అంచనా. ఇలా పెరిగిన లోడ్‌కు తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లు, ఆ సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలి. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. ఇలా ముందు జాగ్రత్త చర్యలకు సంబంధించిన పనులను పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అప్రమత్తంగా ఉన్నాం

వేసవిలో విద్యుత్ లోడ్ భారీగానే పెరుగుతుంది. దీన్ని తట్టుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, ప్రత్యామ్నాయ లైన్లు, సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం వంటి పనులను మార్చి 15వ తేదీ వరకు పూర్తి చేస్తాం. ఎంత లోడ్ పెరిగినా సరఫరాలో అంతరాయం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం.

–శ్రీనాథ్,
పర్యవేక్షక ఇంజనీర్, విద్యుత్‌శాఖ

సమస్యలు తలెత్తొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ రూపేశ్

రంజాన్ ఏర్పాట్లపై ముందస్తు చర్యలు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ఎస్పీ రూపేశ్‌తో కలసి సమీక్ష

సంగారెడ్డి జోన్: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ చెన్నూరి రూపేష్, ముస్లిం మైనార్టీ పెద్దలు, జిల్లా అధికారులతో కలిసి రంజాన్ మాసం ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో తాగునీటి సరఫరా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఈద్గాలు, మసీదులు ఉన్న ప్రాంతాలలో వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారులు, మిషన్ భగీరథ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అవసరమైన రకాల చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు గ్రామాలు, పట్టణాలలో ఫాగింగ్ చేయాలన్నారు. వంటగ్యాస్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. పోలీసులు అవసరమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం పరిశీలన

ఈనెల 27వ జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నిక కొరకు ఉద్యోగులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. సోమవారం సంగారెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12 ద్వారా 74 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేశారని నోడల్ అధికారి బాలరాజు తెలిపారు.

ఓటు హక్కుకు వెసులుబాటు కల్పించాలి

ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలతో కూడిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలలో పని చేస్తున్న వారికి వెసులుబాటు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలికల భద్రతపై దృష్టి పెట్టాలి

సంగారెడ్డి టౌన్: బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామం సమీపంలోని డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయ సమీపంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. సోమవారం బాలిక గృహానికి కలెక్టర్ వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించేలా అన్ని చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. స్కూళ్లు, కళాశాలల వద్ద నిఘా పెంచాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా రూ. 10వేలు, శిశు సంక్షేమ శాఖ ద్వారా రూ25 వేలు ఇప్పటికే అందించామన్నారు. బాలికకు తమ శాఖ ద్వారా రూ.లక్ష పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

విషాదం నింపిన విహారం



కుటుంబ సభ్యులతో మల్లారెడ్డి



వెంకట్రాంరెడ్డి కుటుంబసభ్యులు

- మహా కుంభమేళాకు వెళ్లి ముగ్గురు మృతి
- మామిడ్గి, గంగ్వార్, మల్గి గ్రామాల్లో విషాదఛాయలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మహా కుంభమేళా యాత్ర రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంతో మామిడ్గి, గంగ్వార్, మల్గి గ్రామాలు శోకసంద్రమయ్యాయి. రెండు రోజుల్లో తిరిగి వస్తామంటూ చిన్నారులను చెప్పి వెళ్లిన వారు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మామిడ్గికి చెందిన వెంకట్రాంరెడ్డి, భార్య విలాసిని, వదిన విశాల, ఇటికెపల్లి చెందిన జ్ఞానేశ్వర్‌రెడ్డి, మల్గికి చెందిన మల్లారెడ్డి, సంగారెడ్డికి చెందిన ఉపాధ్యాయుడు మోతిలాల్ కలిసి 22న కారులో మహా కుంభమేళాకు వెళ్లారు. పుణ్య స్నానాలు చేసి కాశీకి బయలు దేరగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ట్రక్కును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకట్‌రాంరెడ్డి, విలాసిని, డ్రైవర్ మల్లారెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు కాగా విశాల వారణాసి ట్రామా సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. వెంకట్రాంరెడ్డి సంగారెడ్డిలో ఉంటూ జహీరాబాద్ ఇరిగేషన్ డీఈఈగా, కోహీర్ ఇన్‌చార్జి అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే.. మల్లారెడ్డి కొంత కాలంగా జహీరాబాద్‌లో ఉంటున్నాడు. కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు ప్రియాంశీ 5వ తరగతి, కుమారుడు సాయి స్లోక్ రెడ్డి 7వ తరగతి చదువుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తోంది. గాయాలైన వారికి మెరుగైన చికిత్స అందించడంతోపాటు మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటోంది.

వెంకట్రాంరెడ్డి సౌమ్యుడు

జహీరాబాద్ రోడ్డు ప్రమాదంలో మరణించిన నీటి పారుదల శాఖ డీఈఈ వెంకట్రాంరెడ్డి విధి నిర్వహణలో అందరికీ ఆదర్శంగా ఉండేవారు. తాను ఉన్నత ఉద్యోగిని అనేవిషయాన్ని పక్కన పెట్టి తానే స్వయంగా పనులు చూసేవారు. విధి నిర్వహణలో ఏ మాత్రం అలక్ష్యం చేయకుండా అన్నీ తానై చూసేవారు. పనుల నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడేవాడు కారని, పని సంతృప్తి కరంగా ఉన్నట్లయితేనే బిల్లులు మంజురు సేచేవారనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిరంలో 1998లో 10వ తరగతి పూర్తి చేసుకున్నారు. అనంతరం ఉన్నత చదువులు హైదరాబాద్‌లో పూర్తి చేసుకుని 2007 జహీరాబాద్‌లో ఉద్యోగం పొందాడు. నీటిపారుదల శాఖలో ఏఈఈగా విధుల్లో చేరారు. అనంతరం పటాన్‌చెరు, నారాయణఖేడ్‌లో ఏఈఈగా పని చేశారు. డీఈఈగా పదోన్నతిపై తిరిగి జహీరాబాద్ వచ్చారు. తోటి ఉద్యోగులు, సిబ్బంది, స్నేహితులు, బంధువులతో మర్యాదగా మసలుకుంటూ సౌమ్యుడిగా పేరుతెచ్చుకున్నారు. రోడ్డుప్రమాదంలో మరణించిన డీఈఈ వెంకట్రాంరెడ్డికి దైవభక్తి అధికం. ప్రతి ఏటా కుటుంబంతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లివచ్చే వారు.

సడెన్‌గా యాత్రకు వెళ్లాలని నిర్ణయం

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లిరావాలనే నిర్ణయం అప్పటికప్పుడు తీసుకున్నట్లుగా బంధువుల ద్వారా తెలుస్తోంది. యాత్రకు వెళుతున్న విషయం సన్నిహితులకు కూడా సమాచారం లేదు. కుంభమేళ ముగుస్తుండడంతో ఎలాగైనా వెళ్లిరావాలని బంధువులంతా నిర్ణయించి ప్రయాణమయినట్లు బంధువర్గాల సమాచారం.

ఆ హక్కు కాంగ్రెస్‌కే ఉంది

స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్ శివసేనారెడ్డి



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

జహీరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే యువతకు ఉద్యోగాలు వచ్చాయని, దీన్ని గుర్తించి పట్టభద్రులంతా పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి జహీరాబాద్‌లో నిర్వహించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ఉద్యోగాలు ఇవ్వలేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సైతం కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, మరో 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వబోతున్నదన్నారు. . బీఆర్ఎస్ లోపాయికారీగా బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, బీజేపీ ఏం సాధించిందని పట్టభద్రుల ఓట్లు అడగతారని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, గోపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు న్యాయపరమైన సహాయం



మాట్లాడుతున్న జడ్జి రమేశ్

సీనియర్ సివిల్ జడ్జి రమేశ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వృద్ధులకు న్యాయ పరమైన సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి బీ.రమేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఐసీఎఫ్‌ఏఐ న్యాయ విద్యా సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధుల సంక్షేమంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ.. చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు సమాజంలో ఆదర్శప్రాయమైన జీవన విధానానికి మార్గం సుగమం అవుతుందన్నారు. పిల్లల ఉన్నతికి శ్రమించిన వృద్ధులను కుటుంబ సభ్యులందరూ గౌరవించాలన్నారు. వృద్ధుల సంక్షేమం ఆయా కుటుంబ సభ్యులదేనని, వేధింపులకు గురైతే చట్టాన్ని ఆశ్రయించి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ విద్యా సంస్థ యూజీ, పీజీ, పరిశోధనా విభాగాధిపతి (డీన్) డాక్టర్ వై.ప్రతాప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

364 ప్రత్యేక బస్సులు

- శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ ఏర్పాట్లు
- సద్వినియోగం చేసుకోవాలి: ఆర్‌ఎం



ప్రభులత
రీజినల్ మేనేజరు

సంగారెడ్డి జోన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 364 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈనెల 26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు నడపనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆరు డిపోల నుంచి ఏడుపాయల వనదుర్గ భవానీ క్షేత్రం, ఝరాసంగం కేతకి సంగమేశ్వర ఆలయం, వట్‌పల్లి, కొప్పోల్ జాతరలు, టేకులగడ్డ ఆలయ క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. ఏడుపాయల దుర్గ భవానీ క్షేత్రానికి మెదక్ నుంచి 40, జేబీఎస్, బాలానగర్ నుంచి 30, నర్సాపూర్ నుంచి 30, శంకరంపేట నుంచి 25, బొడ్మట్ పల్లి నుంచి 30, హైదరాబాద్ నుంచి 20, సంగారెడ్డి నుంచి 30, సదాశివపేట నుంచి 25, జోగిపేట నుంచి 20, జహీరాబాద్ నుంచి 30, ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర ఆలయానికి జహీరాబాద్ నుంచి 32, వట్‌పల్లిలో జరిగే జాతరకు జోగిపేట నుంచి 20, శంకర్ పల్లి నుంచి ఏడుపాయల జాతరకు 10, శంకరంపేట నుంచి కొప్పోల్ జాతరకు 13, టేకుల గడ్డ నుంచి ఆలయం వరకు 9, మొత్తం 364 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎం వివరించారు. వీటితో పాటు జహీరాబాద్ నుంచి ఝరాసంగానికి 6, శంకరంపేట నుంచి కొప్పోల్‌కు 4, జోగిపేట నుంచి వట్‌పల్లికి 5, సిద్దిపేట నుంచి వేములవాడకు సాధారణ బస్సులతో పాటు అదనంగా మూడు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఆయా క్షేత్రాలకు వెళ్లేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రత్యేక బస్సులలో 26నుంచి 28వరకు చార్జీ అదనంగా ఉన్నట్లు వెల్లడించారు. మహాశివరాత్రి జాతర కోసం ఉమ్మడి జిల్లాలోని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం కోరారు.

రసాయన పరిశోధనలకు మద్దతు

- పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్
- ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్ హబ్
- ఈనెల 28 వరకు కొనసాగనున్న సెమినార్లు



సెమినార్లో పాల్గొన్న ఇండో–జర్మనీకి చెందిన ప్రొఫెసర్లు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ హబ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని, పరిశ్రమలు, వాణిజ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్ హబ్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జర్మనీలోని హీడెల్‌బర్గ్ యూనివర్సిటీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఐఐటీ హైదరాబాద్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈనెల 28 వరకు కొనసాగుతుంది. సోమవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జయేష్‌రంజన్ మాట్లాడారు. శాస్త్ర, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ఇండో–జర్మనీ దీర్ఘకాలిక భాగస్వామ్యానికి అనుగుణంగా ఈ హబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమం రెండు దేశాల్లోని విద్యార్థుల సంయుక్త పరిశోధనకు తోడ్పడుతుందని చెప్పారు. అలాగే ఆధునిక రసాయన శాస్త్రంలో అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. 17 మంది జర్మనీ విద్యార్థులతో పాటు, ఐఐటీహెచ్, టీఐఎఫ్ఆర్ విద్యార్థులు, ఆయా విద్యా సంస్థల ప్రొఫెసర్లతో కలిసి ఇండో–జర్మన్ స్కూల్ ఆన్ కంప్యూటేషనల్ కెమిస్ట్రీని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ రసాయన రంగంలోని పరిశోధనలు, ఆవిష్కరణలు వ్యవసాయ రంగం ప్రగతిలో కీలకమైనవని పేర్కొన్నారు. అలాగే ఔషధాలు, ఇంధన వనరులు, మెటీరియల్ రంగాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాయని చెప్పారు. కంప్యూటేషనల్ కెమిస్ట్రీ ఆధునిక పారిశ్రామిక రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని, వీటిలోని ఆవిష్కరణలు ఆయా రంగాల్లో వ్యయాన్ని తగ్గించి, పర్యావరణంపై ప్రభావాన్ని కూడా తగ్గిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెడెల్‌బర్గ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కట్సాపట్సేల్‌మేటర్న్, అండ్రియాస్ డ్రాఫ్, సబూర్ భక్ష్, టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు బీఎస్.మూర్తి, నరహరిశాస్త్రి, బెర్లిన్‌లోని భారత రాయబారి డాక్టర్ రామానుజ్ బెనర్జీ, జర్మన్ కాన్సులేట్ జనరల్ డాక్టర్ కాత్రిన్‌మిసెరా –లాంగ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న శ్రీశిక

తొగుట(దుబ్బాక): మండంలోని ఘనపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పులగూర్ల శీర్షిక జీవశాస్త్రం ప్రతిభా పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి అందుకుంది. హైదరాబాద్‌లో రాష్ట్ర గురుకులాల డైరెక్టర్ రమణ కుమార్, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరి సోమవారం ఆమెకు నగదు బహుమతితో పాటు మెమోంటో బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల హెచ్ఎం అంజలిని ఎంఈవో నర్సయ్య అభినందించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ నవీన్ కుమార్, టీబీఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు అనిల్ కుమార్, నాగరాజు, శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగింత
- మహిళ మెడలోంచి పుస్తెల తాడు చోరీ

కొండపాక(గజ్వేల్): మహిళ మెడలోంచి పుస్తెల తాడును అపహరించుకొని పరుగెత్తుతున్న దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నంగునూర్ మండల కేంద్రానికి చెందిన భార్యాభర్తలు సొప్పరి సుగుణ, బాలకిషన్, మనవడు సాయిచరణ్ 22న తిమ్మారెడ్డిపల్లి గ్రామ మధిర సార్ల వాడలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చారు. సోమవారం సుగుణ మనవడు సాయిచరణ్‌తో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు కొమురవెల్లి కమాన్ వద్ద ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్దకు నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి చాకుతో బెదిరించి నెట్టివేశాడు. కిందపడగానే మహిళ మెడలోంచి మూడున్నర తులాల పుస్తెల తాడును తెంపుకొని పరుగెత్తుతుండగా దొంగ దొంగ అంటూ పెద్దగా కేకలు వేసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానికులు పరుగెత్తుకుంటూ వెళ్లి దొంగను పట్టుకొని కుకునూరుపల్లి పోలీసులకు అప్పగించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి నంగునూరు మండలంలోని సిద్దన్నపేట గ్రామానికి చెందిన కొంకటి తిరుపతిగా సమాచారం. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పైపులు దగ్ధం



కాలిపోయిన పైపులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పైపులు కాలిపోయిన ఘటన మండల పరిధిలోని రామంచలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పేరబోయిన పరుశరాములు వ్యవసాయ పొలం వద్ద రెండు సెట్ల స్ప్రింక్లర్ సెట్ పైపులు ఉంచాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పైపులు పూర్తిగా కాలిపోయాయి. గమనించిన రైతులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వచ్చి మంటలార్పే లోపు పైపులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

కలప అక్రమ రవాణా



లారీలో కలప

రామాయంపేట(మెదక్): రామాయంపేట మీదుగా కలప అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుంది. సోమవారం కలప లారీ రామాయంపేట మీదుగా తరలివెళ్లింది. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే కొందరు కలప అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక రేంజ్ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ.. ముందస్తు అనుమతి పత్రాలు లేకుండా కలప అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జానపదుల వేడుక.. ఏడుపాయల జాతర

- రేపటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- సుమారు 15 లక్షల మంది భక్తుల రాక
- కొనసాగుతున్న ఏర్పాట్లు

జాన పదుల వేడుకగా వినుతికెక్కిన ఏడుపాయల జాతర రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 15 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. మహాశివరాత్రి పురస్కరించుకొని 3 రోజుల పాటు జరిగే ఈ జాతరకు కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి జాతర ప్రారంభిస్తారు.

–పాపన్నపేట(మెదక్):



దుర్గమ్మ ఆలయం

రాతి గుహల్లో అమ్మవారు

ఏడుపాయల ఆలయానికి సుమారు 2,000 యేళ్ల చారిత్రక నేపథ్యం ఉంది. చుట్టూరా మంజీరా.. మధ్యలో రాళ్ల గుట్టలు.. రాతి గుహల్లో వెలసిన దుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిస్తోంది. సర్ప జాతిపై ప్రతీకారం తీర్చుకునేందుకు జనమేజయుడు ఈ ప్రాంతంలోనే సర్పయాగం చేసినట్లు ప్రతీతి. క్రీ.శ.1870లో కాశీనాథ యోగింద్రుడు ఈ ఆలయానికి పూర్వ వైభవం తెచ్చినట్లు తెలుస్తుంది. ఘళిని యప్పచాకి అనే శిల్పి తయారు చేసిన దుర్గమ్మ నల్లరాతి విగ్రహాన్ని పుష్పగిరి పీఠాధిపతి జగత్ గురు ఆదిశంకరాచారి 2 ఫిబ్రవరి 1980 నాడు పునః ప్రతిష్టించాడు.



చెక్ డ్యాం వద్ద ఏర్పాట్లు

మూడు రోజుల జాతర

మహా శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం జాతర ప్రారంభమవుతుంది. మొదటి రోజు భక్తులు మంజీరా నదిలో స్నానాలు చేసి దుర్గమ్మను దర్శించుకొని శివ దీక్షలు చేపడుతారు. సాయంత్రం స్థానిక శివాలయంలో పండ్లతో దీక్షలు విరమిస్తారు. రాత్రి భజనలు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తూ జాగరణ చేస్తారు. రెండో రోజు గురువారం జాతరలో అత్యంత ప్రధానమైన బండ్లు తిరిగే కార్యక్రమం కొనసాగుతుంది. రంగులతో అలంకరించిన బండ్ల పై శివసత్తులు సిగాలూగుతుండగా, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా యువకులు నృత్యాలు చేస్తుంటారు. మూడో రోజు శుక్రవారం రాత్రి 10 గంటలకు రతోత్సవం నిర్వహిస్తారు.

జాతరకు ఎలా రావాలి

ఏడుపాయల జాతరకు రావడానికి ఆర్టీసీ వివిధ డిపోల నుంచి 400 బస్సులు ఏర్పాటు చేసింది

- ➤ హైద్రాబాద్–బాలాగనర్–నర్సాపూర్‌ల మీదుగా వచ్చే భక్తులు పోతంషెట్పల్లి మీదుగా నేరుగా ఏడుపాయల జాతర రావచ్చు.
- ➤ హైద్రాబాద్–తూప్రాన్–సిద్దిపేట, కామారెడ్డి, నిజాంసాగర్–మెదక్ మీదుగా వచ్చే భక్తులు పోతంషెట్పల్లి నుంచి జాతరకు వస్తారు.
- ➤ నారాయణ ఖేడ్, బొడ్మట్‌పల్లి–పాపన్నపేట–నాగ్సాన్‌పల్లి మీదుగా వచ్చే భక్తులు జాతరకు రావచ్చు.
- ➤ మెదక్ మీదుగా వచ్చే భక్తులు అవకాశాన్ని బట్టి మెదక్‌లో చర్చి, ఖిల్లా, పోచారం అభయారణ్యం చూడవచ్చు.
- ➤ జోగిపేట వైపు నుంచి వచ్చే భక్తులు మధ్యలో చిట్కుల వద్ద చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకోవచ్చు.
- ➤ పోతంషెట్పల్లి వైపు జాతరకు కి.మీ దూరంలో పార్కింగ్ ప్రదేశం ఉంటుంది. అక్కడి నుంచి జాతరలోకి రావడానికి ఉచిత ఆర్టీసీ బస్సులను దేవస్థానం ఏర్పాటు చేసింది.
- ➤ నాగ్సాన్‌పల్లి వైపు నుంచి వచ్చే భక్తులు చెలిమలకుంట వద్ద వాహనాలనున పార్కింగ్ చేయాలి. అక్కడి నుంచి ఉచిత బస్సులు ఉంటాయి.



సోలార్ లైట్ల ఏర్పాటు

రేపే పెద్ద పట్నం

కొమురవెల్లిలో మార్మోగనున్న శివనామస్మరణ

- మహాశివరాత్రిని పురస్కరించుకొని కల్యాణం
- జాగరణతో పులకించనున్న భక్తజనం

ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదినానికి సంసిద్ధమైంది. పరమశివుడి ప్రతి రూపంగా కొలువబడుతున్న కొమురవెల్లి మల్లన్నను భక్తులు దర్శించుకొని ఒక్కపొద్దులతో జాగరణ చేసేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వ అభిషేకంలోపాటు నిరంతర అభిషేకాలు చేయనున్నారు. యాదవ పూజారుల ఆధ్వర్యంలో జానపద కళాకృతిలో యాదవ సాంప్రదాయం ప్రకారం తోటబావి ప్రాంగణంలో పెద్ద పట్నం వేసి స్వామి వారికి కల్యాణం నిర్వహించనున్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట):



తోటబావి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు



41 వరుసలతో పట్నం

వీరశైవులు బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా వేదమంత్రోశ్చరణలతో స్వామి వారికి కల్యాణం జరుపగా యాదవ పూజారులు తమ ఆచారం ప్రకారం పంచవర్ణాలతో పట్నం వేసి కల్యాణం జరిపిస్తారు. పసుపు, కుంకుమ, తెల్లపిండి, సునేరు, పచ్చలను ప్రథమ గణాలుగా సమ్మేళనం చేసి చిత్రకన్ను నెలకొల్పి 41 వరుసలతో పట్నాన్ని వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. పట్నం వేయడానికి ముందు ఒగ్గు పూజారులు పల్లకిలో స్వామి వారిని ఊరేగింపుగా తీసుకెళ్లి కోనేటిలో స్నానమాచరింపజేసి శుద్ధి చేసి గంగాదీపం పెట్టి గంగా తెప్ప వదులుతారు. స్వామి వారు ధరించే త్రిశూలం, ఢమరుకాలను నెలకొలిపిన అనంతరం పెద్ద పట్నం పైకి ఆవాహనం చేస్తారు. నలు వైపుల నిమ్మకాయలు, గుమ్మడికాయలతో బలిహరణ చేస్తారు. తెల్లవారుజాము కాగానే గర్భాలయం నుంచి వీరశైవ అర్చకులు ఉత్సవ విగ్రహాలను తీసుకొని పట్నం చుట్టూ ప్రదక్షనలు చేసి తొక్కడం ప్రారంభించిన అనంతరం భక్తులు మల్లన్న స్తుతిస్తూ పట్నంపై చిందేస్తూ తన్మయత్వం చెంది స్వామి వారిని దర్శించుకుంటారు.

విస్తృత ఏర్పాట్లు..



శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారి దర్శనం, అభిషేకం, అర్జిత సేవల నిర్వహణతోపాటు తోటబావి ప్రాంగణంలో అర్ధరాత్రి రచించే పెద్దపటాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లను చేపట్టాం. ఆలయ పరిసరాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశాం. స్వామి వారి దర్శనం త్వరితగతిన అయ్యేలా చర్యలు తీసుకున్నాం.

– రామాంజనేయులు, ఆలయ ఈవో

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఫరీద్‌పూర్ గ్రామ శివారు మంజీరాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. యూపీకి చెందిన మహ్మద్ షాబాద్(37) మెదక్ పట్టణంలోని రాంనగర్‌లో నివాసముంటూ చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 20న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు స్థానిక పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని హవేళిఘణాపూర్ శివారు మంజీరా ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం తేలినట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మహ్మద్ షాబాద్‌గా గుర్తించి కుటుంబీకులు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



షాబాద్ (ఫైల్)

ఇంటి పైకప్పు కూలి మరో వ్యక్తి

గజ్వేల్‌రూరల్: ఇంటి పై కప్పు (స్లాబ్) తలపైన పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని అనంతరావుపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దావనమైన ఎల్లయ్య(45)కు భార్య కలమ్మ, కుమారుడు ఉన్నారు. ఇంటి మరమ్మతు పనులు చేపడుతున్న క్రమంలో ఇంటిపైకప్పు స్లాబు విరిగి ఎల్లయ్య తలపై పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎల్లయ్య మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఆదుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి డిమాండ్ చేశారు.



ఎల్లయ్య (ఫైల్)

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి

సంగారెడ్డి క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి వద్ద చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. కొత్త బస్టాండ్ ఆవరణలో 21న శుక్రవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండటంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 87126 56718 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని యాచకుడు

జిన్నారం (పటాన్‌చెరు): గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. మాదారం గ్రామ శివారులో ప్రాంతంలో ఓ గుర్తు తెలియని 70 ఏళ్ల వయసు గల యాచకుడు మృతి చెంది పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా యాచకుడిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వ్యక్తి మృతదేహం

కుక్కల దాడిలో మేకలు మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): ఇంటి ఆవరణలో కట్టేసిన మేకలపై కుక్కలు దాడి చేయడంతో మూడు మేకలు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని గురువన్నపేటలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బ్రహ్మడ్లపల్లి రాజయ్య తన మేకలను శనివారం రాత్రి తన ఇంటి ఆవరణలో కట్టివేశాడు. తాను ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కుక్కలు మేకలపై దాడి చేయడంతో మూడు మేకలు మృతి చెందాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఎంపీ డీకే అరుణకు తప్పిన ప్రమాదం

ముందు వెళ్తున్న కారును ఢీకొట్టిన కాన్వాయ్

చేగుంట(తూప్రాన్): బీజేపీ ఎంపీ డీకే అరుణ కారు ముందు వెళ్తూ ఆగిపోయిన కారును ఢీకొట్టింది. ఈ ఘటన 44వ జాతీయ రహదారి మాసాయిపేట మండలం బొమ్మారం గేటు సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఎంపీ డీకే అరుణ నిజామాబాద్ వెళ్లి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బొమ్మారం గేటు సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓ కారు ఢీకొని ఆగిపోయింది. ఈ కారు వెనుకాల వస్తున్న డీకే అరుణ కారు ముందు ఆగిన కారును ఢీకొట్టి ఆగిపోయింది. ఎంపీ కారుకు ఎలాంటి ఇబ్బంది కలగకపోవడంతో పోలీసులకు సమాచారం అందించి అదే కారులో హైదరాబాద్‌కు పంపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా పెద్ద కొడంగల్ మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన జంగం నాగేశ్వరి(33) ఆరు నెలల నుంచి పెద్దాపూర్ గ్రామానికి చెందిన గొల్ల మోహన్ ఇంట్లో భర్తతో కలిసి అద్దెకు ఉంటుంది. ఉదయం పది గంటలకు ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త జంగం శివరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నాగేశ్వరి (ఫైల్)

పల్లె ప్రకృతి వనం ధ్వంసం


పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2012లో రూ.2 లక్షల వ్యయంతో పూల మొక్కలను తెచ్చి ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. దేవాలయం పక్కనే ఉండటంతో భక్తులకు పూలు పూజకు ఉపయోగపడుతాయని రకరకాల పూల మొక్కలను పెంచారు. పార్కు నిర్వహణ కోసం ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ నుంచి రూ.5 లక్షల వరకు వ్యయం చేశారు. మహా శివరాత్రి జాతర ఏర్పాట్ల కోసం ఆర్డీవో రాంమూర్తి చుట్టూ చెత్త లేకుండా చేయాలని చెప్పడంతో సిబ్బంది డోజర్ సహాయంతో పార్కులోని చెట్లను పూర్తిగా తొలగించినట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు. దీనిపై గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓను వివరణ కోరగా పల్లె ప్రకృతిని ధ్వంసం చేసిన విషయం పై డీఆర్‌డీఏ పీడీకి సమాచారం ఇచ్చామన్నారు. జిల్లా అధికారుల సూచన మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిపారు. దేవాలయం ఈఓ కిషన్‌రావు గుడి పక్కన పల్లె ప్రకృతి వనం ఉండేది దానిని ఎవరు ధ్వంసం చేశారో తెలియదన్నారు. దాదాపు 300 మొక్కలను ధ్వంసం చేసిన వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.



పల్లె ప్రకృతి ధ్వంసం చేసి చదును చేసిన ప్రాంతం

వరి పంటపై గడ్డి మందు



ఎండిపోయిన వరి

ఎండిపోవడంతో రైతు ఆవేదన

అక్కన్నపేట(హుస్నాబాద్): పచ్చని పంట పొలంపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు చల్లడంతో ఎండిపోయింది. ఈ ఘటన అక్కన్నపేట మండలం గొల్లకుంట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాడ రాజిరెడ్డి సోమవారం ఉదయం పొలానికి వెళ్లగా వరి పొలం ఎండిపోయి ఉండటంతో అవాక్కయాడు. దీంతో ఇరుగుపొరుగు రైతులు వచ్చి పంటపొలాన్ని పరిశీలించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి గడ్డి మందు చల్లినట్లు గుర్తించారు. అనుమానం ఉన్న వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆరుగాలం శ్రమించి చేతికందే సమయంలో గడ్డిమందు చల్లడంపై రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీరుమున్నీరవుతున్నారు.

వంగ సాగు.. బెంగ తీరగ

మార్కెట్‌లో మంచి డిమాండ్ ● కిలో వంకాయలు రూ.40 ● సస్యరక్షణతో సత్ఫలితాలు

జహీరాబాద్ టౌన్: పంట విత్తు నాటే సమయం నుంచి కోతకొచ్చి ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించే వరకు రైతులకు కష్టాలే. డిమాండ్‌కు తగ్గట్టుగా పంట సాగు ఉండాలి. అప్పుడే రైతులకు గిట్టుబాటు ధర దక్కేందుకు అవకాశం ఉంటుంది. వంకాయ సాగులో అనేక ఇబ్బందులు ఉన్నా పండించే రైతు కష్టాలను తీరుస్తుంది. అందుకని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. చీడపీడలు తట్టుకునేలా సరికొత్త వంగడాలు సాగుచేస్తే లాభాల పంట పడుతుందని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, కోహీర్, గుమ్మడిదల, కొండాపూర్, హత్నూర తదితర మండలాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. యేటా సుమారు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల సాగవుతుంది. ఇందులో టమాట, వంకాయ అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు. ఈ కూరగాయలను పట్టణాల్లోని సంతలో విక్రయించడంతో పాటు హైదరాబాద్‌కు తరలిస్తుంటారు. కూరగాయల సాగుకు అధికారులు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా సాగు విస్తీర్ణం అధికంగా ఉంది.



జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న వంకాయ

సాగుకు సమయం

వంకాయను వర్షాకాలంలో జూలై నుంచి ఆగస్టు, చలికాలంలో నవంబర్–డిసెంబర్, వేసవిలో ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారంలో నారును నాటుకోవాలి. సంకరజాతి వంకాయ విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నర్సరీల నుంచి మేలైన రకం నారు తీసుకొని నాటాలి. సారవంతమైన మురుగు నీరు పోయేలా సౌకర్యం కలిగిన అన్ని రకాల నేలల్లో పండుతుంది. నేలను 4 నుంచి 5 సార్లు దున్ని చదును చేయాలి. వర్షాకాలం పంటకు బోదెలు, కాల్వలు ఏర్పాటు చేయాలి. చలికాలం, వేసవి పంటకు 4 నంంచి 5 చ.మీ మళ్లను తయారు చేయాలి.

ప్రస్తుతం డిమాండ్ ఉంది

మార్కెట్‌లో వంకాయలకు మంచి డిమాండ్ ఉంది. శుభకార్యాల సమయం కావడంతో లాభాలు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 40 నుంచి రూ.60 పలుకుతుంది. శ్రావణం, కార్తీకమాసం, పెళ్లిల సమయాల్లో మంచి రేటే తగులుతుంది. ఖర్చులు పోనూ ఎకరాకు రూ. 50 వేల వరకు మిగులుతుంది.

-రామనాయుడు, రైతు, బూచినెల్లి

పంట సాగు విధానం

పొడువుగా నిటారుగా పెరిగే రకాలకు 60–60 సెం. మీ, గుబురుగా పెరిగే రకాలకు 75–50 సెం.మీ దూరంలో నాటాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండిని దుక్కిలో వేసుకోవాలి. బాక్టీరియా ఎండు తెగులు ఉండే ప్రాంతాల్లో ఎకరాకు 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పొడిని చల్లుకోవాలి. రసం పీల్చే పురుగు రాకుండా ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలను నాటే ముందు వేసుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 2 నుంచి 4 టన్నుల బయో మిచ్చర్ వేసి కలియదున్నాలి. నాటిన 30 నుంచి 60 రోజుల్లో 24 కిలోల పొటాష్ 40 కిలోల నత్రజని, 200 కిలోల అమ్మోనియం సల్ఫేట్ లేదా 85 కిలోల యూరియా మూడు భాగాలు చేసి మూడు సార్లు వేయాలి.